# అనుమతి లేని పలు దవాఖానలు సీజ్

సిద్దిపేట, నవంబర్ 18 : సిద్దిపేట పట్టణంలో అనుమతులు లేకుండా నడుపుతున్న పలు దవాఖానలను సీజ్ చేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పల్వాన్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పల్వాన్ కుమార్ మాట్లాడుతూ సోమవారం డాక్టర్ ఆనంద్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ శ్రీకళ పీవో అరుణ్ కుమార్ పట్టణంలో పలు ప్రైవేట్ దవాఖానలపై తనిఖీలు నిర్వహించగా, నాలుగు దవాఖానల్లో క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్-2010 ప్రకారం ప్రభుత్వ ఆదేశాలను అనుసరించకపోవడం, సేవల సమాచారాన్ని, ఆరోగ్య సేవలో వివరాలను పొందుపర్చకపోవడంతో నిరామయ, బజరంగ్ పాలి క్లినిక్, మారుతి పాలిక్లినిక్, గురు సాయి కంటి దవాఖానలను సీజ్ చేసినట్లు తెలిపారు. దవాఖాన పేరు మార్చినా, వైద్యుల పేరు మార్చినా జిల్లా వైద్య అధికారి గారికి తెలపాలన్నారు. ప్రతి నెల 5వ తేదీలోగా హెచ్ఐఎంఎస్ పోర్టల్ అప్డేట్ చేసుకోవాలని సూచించారు. తనిఖీలో ప్రోగ్రామ్ ఆఫీసర్ రాజు, అనిల్ , సిబ్బంది పాల్గొన్నారు.


సిద్దిపేటలోని ఓ ప్రైవేటు దవాఖానను సీజ్ చేస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు

# భూసేకరణకు రైతులు సహకరించాలి

కోహెడ, నవంబర్ 18 : గౌరవెల్లి ప్రాజెక్టు కాల్వల నిర్మాణానికి చేపడుతున్న భూసేకరణకు రైతులు సహకరించాలని హుస్నాబాద్ ఆర్డీవో రాంమూర్తి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో భూసేకరణపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన రైతుల అభిప్రాయాలు తీసుకున్నారు. కాల్వలను నిర్మిస్తే రైతులకు మేలు జరుగుతుందని, అందుకు కొంత మంది రైతుల భూమి పోతుందని భూమి పోతున్న రైతులు శాంతియుతంగా సేకరణకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో హుస్నాబాద్ ఏసీపీ సతీశ్ కుమార్, తహసీల్దార్ సురేఖ, ఇన్‌చార్జి ఎంపీవో శోభ, నీటిపారుదలశాఖ అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

కొమురవెల్లి, నవంబర్ 18 : మండలంలోని మర్రిముచ్చాలకు చెందిన వడ్లకొండ చంద్రకళ అనారోగ్యంతో చికిత్స పొందింది. సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోగా, మంజూరైన రూ.11,500 చెక్కును సోమవారం బీఆర్ఎస్ నాయకుడు ఏర్పుల మహేశ్ బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

**కొండపాకలో..**

కొండపాక(కుకునూరుపల్లి), నవంబర్ 18 : సీఎంఆర్ఎఫ్ నిరుపేదలకు వరమని బీఆర్ఎస్ కొండపాక మండలాధ్యక్షుడు నూనె కుమార్‌యాదవ్ అన్నారు. కొండపాక మండలంలోని దుద్దెడకు చెందిన పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు చిలుముల రామ్మోహన్, మాజీ ఉపసర్పంచ్ గుండెల్లి ఆంజనేయులు, నాయకులు చిక్కుడు భాను, పల్లె బాబు, ఎండీ. ముగ్దుమ్, బూర్గుల సురేందర్‌రావు, బసవరాజు నవీన్, చంద్, గుర్రాల రాజు, రాకేశ్, శ్రీశైలం యాదవ్, ఆంజనేయులు, నేతలు పాల్గొన్నారు.


చెక్కు అందజేస్తున్న మహేశ్

# ప్రజాస్వామ్యాన్ని కేంద్రం ఖూనీ చేస్తుంది..

మద్దూరు(ధూళిమిట్ట), నవంబర్ 18 : కేంద్రంలోని బీజేపీ సర్కారు రాజ్యాంగ సంస్థలను ధ్వంసం చేసి, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే విధంగా వ్యవహరిస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి విమర్శించారు. సోమవారం ధూళిమిట్ట మండల కేంద్రంలో సీపీఎం రెండో మండల మహాసభను పోతిరెడ్డి రాజు, చొప్పరి ప్రసాద్ అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో పెట్టుబడిదారులకు లాభం చేకూర్చేవిధంగా నాలుగు లేబర్‌కోడ్లు తెచ్చిందని దుయ్యబట్టారు. అంతకుముందు సీపీఎం జెండాను కార్యకర్తలతో కలిసి ఆముదాల మల్లారెడ్డి ఆవిష్కరించారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రాళ్లబండి శశిధర్, జిల్లా కమిటీ సభ్యుడు చొప్పరి రవికుమార్, చేర్యాల మండల కార్యదర్శి బండకింది అరుణ్‌కుమార్, పలువురు మండల నాయకులు పాల్గొన్నారు.


మహాసభలో మాట్లాడుతున్న ఆముదాల మల్లారెడ్డి

# హుస్నాబాద్‌లో ఈజీఎస్ సామాజిక తనిఖీ ప్రజావేదిక

హుస్నాబాద్‌రూరల్, నవంబర్ 18 : హుస్నాబాద్ ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో సోమవారం ఈజీఎస్ సామాజిక తనిఖీ ప్రజావేదిక జరిగింది. 2023 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2024 మార్చి 1వ తేదీ వరకు మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో జరిగిన పలు పనులపై ఈ సామాజిక తనిఖీ కొనసాగింది. మొత్తంగా జరిగిన ఉపాధి పనులకు గానూ రూ. 24వేల జరిమానా విధించడంతో పాటు రూ. 50వేలను రికవరీ చేసినట్లు అధికారులు చెప్పారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ పీడీ బాలకిషన్, ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి, విజిలెన్స్ అధికారి శివాజీ, ఈజీఎస్ సిబ్బంది ఉన్నారు.

# మాల మహానాడు వాల్ పోస్టర్ ఆవిష్కరణ



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

మిరుదొడ్డి (అక్బర్‌పేట-భూంపల్లి), నవంబర్ 18 : అక్బర్‌పేట-భూంపల్లి మండలం కేంద్రంలో సోమవారం ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య 22న నిర్వహించే మాల మహానాడు మహా పాదయాత్ర వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. మాల మహానాడు రాష్ట్ర పొలిట్ బ్యూరో చైర్మన్ ర్యాకం శ్రీరాములు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మండల యాదగిరి నాయకులు రవి, కుమార స్వామి, రాజు, రమేశ్, నర్సింహులు, పరశురాములు, అనిల్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

# ప్రారంభానికే పరిమితమైన కొనుగోలు సెంటర్లు

**బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్**

చిన్నకోడూరు, నవంబర్ 19 : ఆయా గ్రామాల్లో కొనుగోలు సెంటర్లు ప్రారంభానికి సీఎం, మంత్రులు మాటలకే పరిమితమయ్యారని బీఆర్ రాష్ట్ర నాయకుడు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్, మాజీ వైస్ ఎంపీపీ కీసరి పాప య్య, అల్లిపూర్ గ్రామ శాఖ అధ్యక్షుడు కుం భాల చంద్రశేఖర్ అన్నారు. చిన్నకోడూర్ మండల కేంద్రంలో ఏర్పాటు సోమవారం చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వడ్లు తూకం వేసిన వారంలోపే రైతు బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ చేస్తామన్న ప్రభుత్వం నేటి కూడా రైతు ఖాతాలో డబ్బులు జమ చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తుందని మండిపడ్డారు. ప్రభుత్వ పనితీరును ప్రజలు పరిశీలిస్తున్నారని రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.


సమావేశంలో మాట్లాడుతున్న నేతలు

# కార్తిక పూజలు


కార్తిక సోమవారం పురస్కరించుకొని మద్దూరు రామాలయంలో పూజలు చేస్తున్న భక్తులు .
-మద్దూరు (ధూళిమిట్ట), నవంబర్18


సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో క్యూలో ఉన్న గ్రూప్- 3 అభ్యర్థులను తనిఖీ చేసి పంపిస్తున్న పోలీసులు


సిద్దిపేట బాయ్స్ హై స్కూల్‌లో మహిళా అభ్యర్థులను తనిఖీ చేసి పంపిస్తున్న పోలీసులు

# ప్రశాంతంగా ముగిసిన గ్రూప్-3

**అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్**

సిద్దిపేట కలెక్టరేట్, నవంబర్ 18 : టీజీపీఎస్సీ గ్రూప్-3 పేపర్ 1,2 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ తెలిపారు. సోమవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో జరిగిన టీజీపీఎస్సీ గ్రూప్-3 పరీక్ష కేంద్రాలను అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గ్రూప్-3 పరీక్ష ప్రశాంతంగా జరిగిందని 37 పరీక్ష కేంద్రాల్లో మొత్తం 13401 మంది అభ్యర్థులకు మూడో పేపర్‌కు 54.8 శాతంతో 7349 మంది హాజరైనట్లు తెలిపారు.

**సిబ్బందికి అభినందనలు తెలిపిన సీపీ**

గ్రూప్-3 పరీక్ష ప్రశాంతంగా ముగిశాయని పోలీస్ కమిషనర్ డాక్టర్ అనురాధ తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సమర్థవంతంగా విధులు నిర్వహించిన పోలీస్ అధికారులను, సిబ్బందిని అభినందించారు.


పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

# సభ్యుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

వర్గల్, నవంబర్18 : మండలంలోని ప్రసిద్ధపుణ్యక్షేత్రమైన నాచగిరి శ్రీలక్ష్మీనరసింహ స్వామి దివ్యక్షేత్రంలో పాలకమండలి సభ్యుల నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆలయ ఈవో అన్నపూర్ణ తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థు లు వచ్చే నెల 14వ తారీఖులోగా దేవాదాయ ధర్మాదాయశాఖ హైదరాబాద్ కార్యాలయంలోగానీ లేదా సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని దేవాదాయ ధర్మాదాయశాఖ సహాయ కార్యాలయంలో దరఖాస్తుచేసిన ఫారాలను సమర్పించాలని తెలిపారు. పూర్తి వివరాలకు నాచగిరిక్షేత్రంలోని ఈవో కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

# రేషన్ బియ్యం పట్టివేత

మద్దూరు(ధూళిమిట్ట), నవంబర్18 : మద్దూరు మండలంలోని వల్లంపట్లలో సోమవారం ఓ ఇంటిలో అక్రమంగా నిల్వచేసిన రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై విజయ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఏఎస్సై మాట్లాడుతూ పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్న క్రమంలో నమ్మదగిన వ్యక్తులు అందించిన సమాచారం మేరకు గ్రామానికి చెందిన గౌరిశెట్టి విశ్వనాథం ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన 7 క్వింటాళ్ల 70 కిలోల బియ్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యాన్ని పంచనామా నిర్వహించి, ఆర్ఐ రమేశ్‌కు అప్పజెప్పినట్లు తెలిపారు.


స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యాన్ని చూపుతున్న అధికారులు

# ఆయిల్‌పామ్‌సాగుపై రైతులకు అవగాహన

కొమురవెల్లి, నవంబర్ 18 : మండలంలోని ఐనాపూర్, తపాస్‌పల్లి గ్రామల్లో సోమవారం మండల వ్యవసాయాధికారి వెంకట్రావమ్మ, ఆయిల్‌పామ్ ఫీల్డ్ ఆఫీసర్ కీర్తనతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయిల్‌పామ్ సాగు చేయడం వల్ల జరిగే లాభాల గురించి, సాగు చేస్తున్న రైతుల అనుభవాలను అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవో రూప, రైతులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న ఏవో వెంకట్రావమ్మ

# కొనసాగుతున్న కులగణన సర్వే

హుస్నాబాద్‌టౌన్, నవంబర్ 20 : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వే పట్టణంలో సోమవారం కొనసాగింది. పట్టణంలోని 20 వార్డుల్లో నిర్వహిస్తున్నకుల గణన సర్వేలో భాగంగా ఇంటింటికి వెళ్లి ఉపాధ్యాయులు, వార్డు అధికారులు, మెప్మా ఆర్పీలు ప్రజల నుంచి సమాచారాన్ని సేకరించారు. పలు వివరాల నమోదు తీరును పలువురు సూపర్‌వైజర్లు ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు.

**మద్దూరులో 60శాతం సర్వే పూర్తి**

మద్దూరు(ధూళిమిట్ట), నవంబర్18 : మద్దూరు మండలంలో 60 శాతం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పూర్తయినట్లు మద్దూరు తహసీల్దార్ మహ్మద్ ఏజీ రహీం అన్నారు. వివిధ గ్రామాల్లో జరుగుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను తహసీల్దార్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 53 బ్లాక్‌లు ఉన్నాయని, వీటిలో 53 మంది ఎన్యూమరేటర్లు సర్వే చేస్తున్నట్లు తెలిపారు. సర్వేను ఐదుగురు సూపర్‌వైజర్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. మరో వారం రోజుల వ్యవధిలో మద్దూరు మండలంలో వంద శాతం సర్వే పూర్తికానున్నట్లు తెలిపారు. సర్వేను పూర్తి స్థాయిలో డాటా ఎంట్రీ చేసి సర్వేలోని అంశాలను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయనున్నట్లు తెలిపారు. దీనికోసం మద్దూరు మండల పరిషత్ కార్యాలయంలో 35 కంప్యూటర్లను సిద్ధం చేసి ఆపరేటర్లను నియమించినట్లు తెలిపారు.


మద్దూరు : సలాఖపూర్‌లో సర్వేను పర్యవేక్షిస్తున్న తహసీల్దార్ రహీం

# రాష్ట్రస్థాయి వాలీబాల్‌కు రాయపోల్ క్రీడాకారుడు

రాయపోల్, నవంబర్ 18 : రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు రాయపోల్ ఉన్నత పాఠశాల విద్యార్థి భరత్ ఎంపికైనట్లు పాఠశాల పీఈడీ గోవర్ధన్‌రడ్డి తెలిపారు. ఈ నెల చివరి వారంలో మహబూబ్‌నగర్ జిల్లా నారాయణపేట్‌లో జరిగే రాష్ట్ర స్థాయి అండర్ 19 వాలీబాల్ పోటీల్లో పాల్గొంటున్నట్లు ఆయన పేర్కొన్నారు.


క్రీడాకారుడు భరత్

# రేపు బాక్సింగ్ క్రీడాకారుల ఎంపిక

కొండపాక(కుకునూరుపల్లి), నవంబర్ 18 : కొండపాక మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో రేపు (బుధవారం) ఉదయం 9 గంటలకు ఉమ్మడి మెదక్ జిల్లా బాక్సింగ్ క్రీడాకారుల ఎస్‌జీఎఫ్ అండర్ 14 బాలురు , అండర్ 17 బాలబాలికల విభాగం ఎంపికలు నిర్వహిస్తున్నట్లు సోమవారం ఫిజికల్ డైరెక్టర్ ఎన్. భాస్కర్‌రెడ్డి తెలిపారు. అసక్తి గల విద్యార్థులు ఒరిజినల్ ఆధార్, బోనఫైడ్‌తో హాజరుకావాలన్నారు. వివరాలకు 9989348884 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

# పీడీఎస్ బియ్యం లారీకి మంటలు

గజ్వేల్, నవంబర్ 18 : ప్రమాదవశాత్తు పీడీఎస్ బియ్యంలోడ్ లారీకి మంటలు వ్యాపించిన సంఘటన మండల పరిధిలోని రిమ్మనగూడ ఔటర్ రింగ్ రోడ్డుపై సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. చిన్నకోడూర్ మండలం మల్లారంలోని రైస్‌మిల్లు నుంచి 290 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యంతో లారీ చర్లపల్లి ఎఫ్‌సీఐ గోదాంకు బయలుదేరింది. ఈ క్రమంలో లారీ టైర్లకు అధిక వేడి కారణంగా రిమ్మనగూడ రింగ్‌రోడ్డుపైకి రాగానే టైర్లకు మంటలు వ్యాపించాలి. వెంటనే గమనించిన డ్రైవర్ స్థానిక పోలీసులకు, ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. ఫైర్ ఇంజన్ సాయంతో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. దీంతో పెను ప్రమాదం తప్పింది.

# మాజీ ఎమ్మెల్సీ పరామర్శ..

రాయపోల్, నవంబర్ 18 : పేదలకు తాను ఎల్లాప్పుడు అండగా ఉంటామని మాజీ ఎమెల్సీ ఫరూక్‌హుస్సేన్ అన్నారు. సోమవారం రాయపోల్ మండల కేంద్రంలో అనారోగ్యంతో హమలీ కార్మికులు పంబాల రఘుతో పాటు ఇటీవల అర్థిక ఇబ్బందులతో అత్మహత్య చేసుకున్న ఉషనగల్ల రాములు కుటుంబాలను పరామర్శించారు. మండంలోని మంతూర్ గ్రామానికి చెందిన పడిగే నర్సింహులు గుండెపోటుతో మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మహ్మద్ ఖాసీం కుటుంబ సభ్యును పరామర్శించి, మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ యాదగిరి, మండల మాజీకో-ఆప్షన్ సభ్యులు పర్వేజ్, బీఆర్ఎస్ నాయకులు మంజూర్, బాగిరెడ్డి, మల్లారెడ్డి, తదితరులు ఉన్నారు.


బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్సీ ఫారూక్ హుస్సేన్

# ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి

**దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు మల్లికార్జున్**

సిద్దిపేట టౌన్, నవంబర్ 18 : కాంగ్రెస్ ఎన్నికల సమయంలో దివ్యాంగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మల్లికార్జున్ డిమాండ్ చేశారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో దివ్యాంగుల జిల్లా స్థాయి సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ప్రతి నెల ఇవ్వాల్సిన సమయంలో ఫించన్లు రాక, పెరగక దివ్యాంగులు కష్టాల పాలు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం దివ్యాంగుల సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడి నరసింహ, ఇన్‌చార్జిగా ఆంజనేయులును నియమించారు. సమావేశంలో సంఘ నేతలు శ్రీనివాస్, బాలకృష్ణ, ఆండాలు, యాదగిరి, అనిల్,భాను, బాలరాజు, లింగం,సాగర్, ప్రసాద్,యాదగిరి తదితరులు పాల్గొన్నారు.


సంఘం రాష్ట్ర అధ్యక్షుడిని సన్మానిస్తున్న దివ్యాంగ సంఘ నేతలు

# ఎన్యూమరేటర్లను వేధింపులకు గురి చేయొద్దు

కొండపాక(కుకునూరుపల్లి), నవంబర్ 18 : సమగ్ర కుటుంబ సర్వే చేస్తున్న ఉపాధ్యాయులను(ఎన్యూమరేటర్లు)ను వేధింపులకు గురిచేస్తున్నారని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిట్యాల విజేయేందర్‌రెడ్డి, బాధ్యులు రామస్వామి, సత్యకృష్ణ, రాములు అన్నారు. సోమవారం సభ్యత్వ సందర్శనలో భాగంగా కొండపాక మండలంలోని దుద్దెడ, బందారం, అంకిరెడ్డిపల్లి, మర్పడగా ఖమ్మంపల్లి, సిరిసినగండ్ల, కొండపాక కేజీబీవీ, బాలికల, బాలుర ఉన్నత పాఠశాల, తిమ్మారెడ్డిపల్లి ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలను సందర్శించి సమస్యలను సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొంటున్న ఉపాధ్యాయులను టార్గెట్లు పూర్తి చేయాలని వేధింపులకు గురిచేస్తున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. ఒక్కొక్క ఎన్యూమరేటర్‌కు 150 కుటుంబాలు కేటాయించడం వల్ల అనుకున్న సమయంలో పూర్తి కావడం లేదని మరో 10 రోజులు పొడిగించాలని కోరారు. కార్యక్రమంలో కొండపాక, కుకునూరుపల్లి మండలాల అధ్యక్షుడు, నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న టీపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు

# విద్యార్థులు భవిష్యత్‌లో రాణించాలి

గజ్వేల్, నవంబర్ 18 : విద్యార్థులు మంచిగా చదువుకొని భవిష్యత్‌లో రాణించేలా ప్రణాళికను రూపొందించుకోవాలని సామాజిక సమరత వేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆకుల నరేశ్ బాబు అన్నారు. సోమవారం బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లో లోకమాత ధీర వనిత అహిల్యా బాయి హో ల్కర్ త్రీ శతాబ్ది జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ సాయినాథ్‌రెడ్డి, వార్డెన్ జ్యోతి పాల్గొన్నారు.


విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న డాక్టర్ ఆకుల నరేశ్ బాబు

# పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలి

గజ్వేల్, నవంబర్ 18: ప్రతి రోజు విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కమలా క్రిస్టియానా అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం కళాశాలలో బుక్స్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. అధ్యాపకులు అవులపాటి వేణు, శోభారాణి, బాలచంద్రం, సుజాత, రమణారెడ్డి, సరోజా, సుమలత, జ్యోతి, భావనలు పాల్గొన్నారు.

# వరి కొయ్యలను కాల్చవద్దు

కొండపాక (కుకునూరుపల్లి), నవంబర్ 18 : రైతులు అనవసరంగా వరి కొయ్యలను కాల్చవొద్దని కొండపాక మండల వ్యవసాయాధికారి శివరామకృష్ణ అన్నారు. సోమవారం కొండపాక మండలంలోని దర్గా గ్రామంలో రైతులకు వరి కొయ్యలను కాల్చడం వల్ల జరిగే నష్టాలను వివరించారు. వరి కొయ్యలను కాల్చడం వల్ల వాతావరణ కాలుష్యం ఏర్పడి పర్యావరణానికి హాని జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో సంధ్య పాల్గొన్నారు.

# సోషల్ మీడియా డైరెక్టర్ అరెస్టు సిగ్గుచేటు

**ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి**



చేర్యాల, నవంబర్ 18 : బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా డైరెక్టర్ కొణతం దిలీప్‌ను పోలీసులు అరెస్టు చేయడాన్ని ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి ఖండించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దిలీప్‌ను పదేపదే అరెస్టు చేసేందుకు యత్నించి, విచారణ పేరిట పిలిచి అక్రమ అరెస్టు చేయడం కాంగ్రెస్ సర్కార్ పరాకాష్టకు ప్రతిరూపమన్నారు. కొణతం దిలీప్, సోషల్ మీడియా వారియర్లతో పాటు బీఆర్ఎస్ నాయకులపై అక్రమ అరెస్టులను అన్నివర్గాలు ఖండించాలని కోరారు. దిలీప్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# మందుబాబులకు జరిమానా

గజ్వేల్, నవంబర్ 18 : మద్యంతాగి వాహనాలు నడిపిన 33 మందికి జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ మురళి తెలిపారు. పట్టణంలోని ప్రధాన చౌరస్తాల వద్ద వాహనాలను తనిఖీ చేశామన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపిన 33 మందిని కోర్టులో హాజరుపర్చగా,నిందితులకు రూ.25 వేల జరిమానాను సోమవారం జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ప్రియాంక విధించినట్లు తెలిపారు.

**సిద్దిపేటలో..**

సిద్దిపేట టౌన్, నవంబర్ 18 : మద్యం తాగి వాహనాలు నడిపిన మందు బాబులకు సిద్దిపేట న్యాయస్థానం సోమవారం జరిమానా విధిస్తూ తీర్పునిచ్చింది. సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ వివరాల ప్రకారం..ట్రాఫిక్ సర్కిల్ పరిధిలోని నర్సాపూర్, ఎంపీడీవో చౌరస్తాలతో రాజీవ్ రహదారిపై పోలీస్ సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 14 మంది మందు బాబులను పట్టుకున్నామన్నారు. ఈ మేరకు సిద్దిపేట స్పెషల్ సెంకడ్ క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు ముందు హాజరుపరుచగా, విచారణ జరిపిన న్యాయమూర్తి వాహనదారులకు రూ. 22,500 వేలు జరిమానా విధించారు.

# పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలి

దుబ్బాక, నవంబర్18 : ప్రభుత్వం ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులతో పాటు నాలుగు డీఏలను వెంటనే చెల్లించాలని టీపీటీఎఫ్ నాయకులు తిరుపతిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం దుబ్బాక మండలం తిమ్మాపూర్, పద్మనాభునిపల్లి, ఆకారం, గోసన్‌పల్లి, గంబీర్‌పూర్, చీకోడు ప్రభుత్వ పాఠశాలలను ఆయన సందర్శించారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో పని చేస్తున్న ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలన్నారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు నరసింహారెడ్డి, నాయకులు జానకిరాములు, రవీందర్‌రెడ్డి, వెంకట్, పెంటయ్య, లక్ష్మీనారాయణ, చంద్రశేఖర్, వేణు, పంకజ, తదితరులు పాల్గొన్నారు.

## పీస్ డైరెక్టర్ నిమ్మయ్యకు పాన్ ఇండియన్ సొసైటీ అవార్డు

జగదేవపూర్ నవంబర్18 : మండల కేంద్రం జగదేవ్‌పూర్‌లోని పీస్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ నిమ్మయ్యను పాన్ ఇండియన్ సొసైటీ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి అవార్డుతో సన్మానించారు. సోమవారం హైదరాబాద్‌లోని బిర్ల బాస్కర ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో భాగంగా ఎంఎల్‌సీ కోదండరాం, గజల్ శ్రీనివాస్ చేతుల మీదుగా అవార్డును ఆయనకు అందించి సత్కరించారు.

# ఆర్థిక సాయం

చేర్యాల, నవంబర్ 18 : బీఆర్ఎస్ అధినేత, కేసీఆర్ స్ఫూర్తితో సామాజిక సేవ కార్యక్రమాలు ప్రారంభించానని బీఆర్ఎస్ పట్టణ మహిళ మాజీ అధ్యక్షురాలు పచ్చిమడ్ల మానస తెలిపారు. మున్సిపాలిటీ పరిదిలోని 12వ వార్డుకు చెందిన తుమ్మలపల్లి సత్తయ్య ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ నాయకులతో కలిసి పరామర్శించి, 50 కిలోల బియ్యం అందజేశారు. కొమురవెల్లి మల్లన్న ఆలయ మాజీ డైరెక్టర్ ఉట్కూరి అమర్ గౌడ్, బాచిగౌడ్ ఉన్నారు.

# షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం

తొగుట, నవంబర్ 18 : ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధమైన సంఘటన తొగుట మండల పరిధిలోని ఘనపూర్ గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వృద్ధురాలు మచ్చల కనకవ్వ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. సోమవారం ఉదయం గుడిసేలో లైట్ ఆన్ చేసి చుట్టుపక్కల వారి ఇంటి వద్దకు వెళ్లింది. ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్ కావడంతో గుడిసే పూర్తిగా మంటల్లో దగ్ధమైంది. కనకవ్వకు చెందిన 30 తులాల వెండి, తులం బంగారం రూ.30 వేల నగదు పూర్తిగా మంటల్లో ఖాళీ బూడిద అయ్యాయి. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితురాలు, గ్రామస్తులు కోరారు.